క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఎంఈఓ-1సామల సింహాచలానికి మాత్రలు అందిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి పాఠశాలల వద్ద ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయించాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి కోరారు. ఈ మేరకు ఎంఈఓ-1సామల సింహాచలానికి ఆమె మాత్రలను బుధవారం అందజేశారు. మండలంలోని అన్ని పాఠశాలల వద్ద విద్యార్థులకు తప్పనిసరిగా ఈ మాత్రలను పంపిణీ చేయించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్యశాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజావసరాలకు అనుగుణంగా ఇంటింటి కుళాయిలు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, మంచినీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి సంబంధిత అధికారుల సహకారంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రతి శుక్రవారం వైద్యారోగ్యశాఖ అధికార సిబ్బంది సహకారంతో 'ఫ్రైడే' 'డ్రైడే' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ట్రాఫిక్ ఎస్సై బాధ్యతల స్వీకరణ



ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సైగా జి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా ఇంతవరకు విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ట్రాఫిక్ ఎస్సైగా పార్వతీపురంలో విధులు నిర్వహించిన పాపయ్య అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై జి.సత్యనారాయణ మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పూర్తి ప్రణాళికలు చేపడతామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ వాసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు వారికి సహకరించాలని కోరారు.

పీఏసీఎస్ అధ్యక్షురాలిగా లీల నియామకం



పీఏసీఎస్ అధ్యక్షురాలిగా నియమితులైన లీల

కురుపాం: కురుపాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షురాలిగా కురుపాం పంచాయతీ పరిధిలోని పూతికవలస గ్రామానికి చెందిన శంబంగి లీలను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉన్న కొదంగోళ్ల గౌరీశంకరరావు (మజ్జి)ను తప్పించి ఈయన స్థానంలో నూతనంగా అధ్యక్షురాలిగా పదవిని శంబంగి లీలను, సభ్యులుగా గవర విజయ్ చంద్రశేఖర్, అద్దేపల్లి భాస్కరరావును నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంబంగి లీల మాట్లాడుతూ పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలపై ఒత్తిడి తీసుకురాకుండా పన్ను వసూలు చేయాలని సూచించారు. మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఖాళీ స్థలాలకు సైతం పన్ను వేయాలన్నారు. ఆయనతో పాటు మేనేజర్ జి. జయరామ్, ఆర్ఐ కె. గజపతిరావు ఉన్నారు.

డీ వార్మింగ్‌తో పిల్లల్లో రక్తహీనత నివారణ

పార్వతీపురంటౌన్:

డీవార్మింగ్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం నివారించవచ్చునని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి, చినమరికి గ్రామాల్లో వెల్‌నెస్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈనెల 9న నిర్వహించనున్న డీ వార్మింగ్‌డే కార్యక్రమానికి అవసరమైన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ, అర్హులైన పిల్లలు, విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర వివరాలపై ఆరా తీశారు. అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అక్కడి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పంపిణీ చేయాల్సిన ఆల్బెండజోల్ మాత్రల స్టాక్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వాటి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమానికి ముందుగా హ్యాండ్‌వాషింగ్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో చేయించాలని సూచించారు. అనంతరం వెల్‌నెస్ కేంద్రం తనిఖీ చేసి రికార్డులను, అందుబాటులో ఉంచిన మందులను, వైద్యపరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్యసిబ్బంది టి.శిరీష, పి.నిర్మల, సీహెచ్ కృష్ణవేణి, బంగారునాయుడు, కన్నంనాయుడు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెల్‌నెస్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు మంజూరుచేసిన స్థలాలను లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ జి.వెంకటజనార్దన్ సూచనల మేరకు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పెదభోగిలి 1,2 వీఆర్వోలు పి.కుమారస్వామి, ఎం.సింహాచలం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆ రెండు సచివాలయాల్లో డిజిటల్ సహాయకులు నిర్వహిస్తున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదభోగిలి 1,2 సచివాలయాల పరిధిలో ప్రభుత్వ భూమిలో సుమారు 600 మంది పేదలకు జగనన్న లేవుట్‌లు వేసి ఇళ్లస్థలాలను మహిళలపేరున ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణం సగానికి పైగా పూర్తి కావడంతో స్థలాలను ఎటువంటి ఖర్చులేకుండానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడంతో తహసీల్దార్ జి వెంకట జనార్దన్ ఆధ్వర్యంలో నాలుగు గ్రామాలకు నుంచి వస్తున్న నివేశ పట్టాలను స్వీకరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వీఆర్వోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పెదభోగిలి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం

● మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురంటౌన్: ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహిస్తోందని, నాడు-నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి వైద్య సేవలను చేరువ చేసేందుకు ఓ పక్క ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలు అందిస్తూ, మరో పక్క జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యసేవలను అందిస్తోందన్నారు. జేఏఎస్-2 ద్వారా గ్రామాల్లో స్పెషలిస్టు వైద్యం అందిస్తూ అవసరమైన వారిని ఉన్నత వైద్యం నిమిత్తం ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ తెలుగు బోదయ్య, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ. 54 లక్షలతో మంచినీటి ట్యాంక్

వీరఘట్టం: జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ. 54 లక్షలతో వీరఘట్టాం మేజర్‌పంచాయతీలోని బీసీ కాలనీ వద్ద కొత్త రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ రామచంద్రరావు మాట్లాడుతూ, ట్యాంక్‌తో పాటు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. ట్యాంక్‌కు వండవ కొండ పైనుంచి వస్తున్న ఉపరితల రక్షిత పథకం పైపులైన్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్యాంక్ పూర్తయితే బీసీ కాలనీ, గాయత్రీనగర్ కాలనీ, ఆర్అండ్‌బీ బంగ్లా, రెల్లివీధి, గొల్లవీధి, అగ్రహారం వీధి, గాసీ వీధులకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతుందని చెప్పారు.

తెలగా కులస్తులను బీసీల్లో చేర్పించాలి

పాలకొండ: తెలగా కులస్తులను బీసీల్లో చేర్చాలని తెలగ కుల సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు అప్పికొండ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలో పీవీఆర్ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా తెలగ సంక్షేమ సంఘ నాయకులు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలగా కులస్తులను బీసీల్లో చేర్చాలన్న డిమాండ్‌తో పీవీఆర్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

త్వరగా జలజీవన్ మిషన్ పనులు



జలజీవన్ మిషన్ పనులపై సమీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో మిగిలి ఉన్న జలజీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల స్థాయి జలజీవన్ మిషన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ జల సంఘం కమిటీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జలజీవన్ మిషన్ పథకం ద్వారా మొత్తం 137 పనులు మిగిలి ఉన్నాయని, ఈ పనులు పూర్తి చేసేందుకు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టంను నియమించుకొని, సకాలంలో ఆయా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్, వైకేపీ ఏపీఎం ఆదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని వసతులతో పోలింగ్ కేంద్రాలు

● ఆర్డీఓ హేమలత

బలిజిపేట: సాధారణ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులను ఏర్పాటు చేయాలని ఆర్డీఓ హేమలత సూచించారు. ఈ మేరకు ఆమె మండలంలోని చెల్లెంపేట, అరసాడ, బడేవలస, శివరాంపురం, పదమాయవలస, చిలకలపల్లి, నూకలవాడ, వంతరాం, గంగాడ, గలావల్లి పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయం, తాగునీరు, ర్యాంప్, ఫ్యాన్లు, ఫర్నిచర్, తలుపులు, కిటికీలు తదితర మౌలిక సదుపాయాల కల్పన ఉండాలని స్పష్టం చేశారు. ఓటింగ్‌కు వచ్చే దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేలా ర్యాంప్‌ల ఏర్పాటు, సిబ్బంది, ఓటర్లకు మరుగు సదుపాయం కల్పించాలని సూచించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు. వాటికి సంబంధించిన నిధులు మంజూరయ్యాయని పనులు చేయించాలని కోరారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న మరమ్మతులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రమేష్‌నాయుడు, సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



చెల్లెంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత, అధికారులు

మంచి ఫలితాలతో జిల్లాకు పేరు తేవాలి



అరసాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ హేమలత

● ఆర్డీఓ హేమలత

బలిజిపేట: రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆర్డీఓ హేమలత కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడి కొన్ని సూచనలు అందించారు. పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షల భయం పోగొట్టుకోవాలని హితవుపలికారు. పరీక్షలకు ఏవిధంగా ప్రిపరేషన్ చేసుకోవాలో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలతో చదువుకోవాలని చెప్పారు. పరీక్షలు పూర్తయ్యేవరకు చదువుపై దృష్టిసారించి మంచి ఫలితాలు వచ్చేవిధంగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మెయిన్‌రోడ్డు వద్ద చేస్తున్న ర్యాలీ

సాలూరు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన సాలూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేసి, రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల చాలావరకు రోడ్డుప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించడం, మరికొంత మంది తీవ్రగాయాలపాలవుతున్న ఫలితంగా వారితో పాటు వారిమీద ఆధారపడిన వ్యక్తులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణం చేయరాదని చెబుతూ ఇతర ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.

మౌలిక వసతులు తప్పనిసరి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

వీరఘట్టం: ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలనిన ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. మండల కేంద్రంలోని సీబీఎం స్కూల్‌లోని 257వ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రం భవనం పైకప్పును బాగు చేయాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్ కె.జయప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఎంఈఓ ఆర్.ఆనందరావు, తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

గడువులోగా రేషన్ సరుకుల పంపిణీ

సీతానగరం: ప్రభుత్వం ప్రతినెలా రేషన్ వినియోగదారులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని తహసీల్దార్ జి.వెంకటజనార్దన్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని లక్ష్మీపురంలో వాహనం ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తుండగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ వినియోగదారులు ఇళ్లలో ఉన్న సమయాన్ని గుర్తించి వాహనం ద్వారా సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం సీతానగరం, పెదభోగిలి, లక్ష్మీపురం, బూర్జ, కృష్ణారాయ పురం పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, బీఎల్వోలు, డీలర్లు పాల్గొన్నారు.



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ జీవీ జనార్దన్

ముగిసిన గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని నేరడి - బిలో గ్రామదేవత బంగారమ్మతల్లి సంబరాలు బుధవారంతో ముగిశాయి. మహిళలు ముర్రాటలతో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

● మక్కువను కప్పేసిన మంచుదుప్పటి



మక్కువను కప్పివేసిన మంచు

మక్కువ మండల కేంద్రాన్ని బుధవారం మంచు కప్పివేసింది. ఉదయం 8.30గంటల వరకు మంచు కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారులు కనిపించకపోవడంతో, లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

– మక్కువ



మంచులో నడుస్తున్న స్థానికులు



మంచు ప్రభావంతో రహదారి కనిపించక లైట్లు వేసి ప్రయాణిస్తున్న వాహన చోదకులు

సాగునీటికి నిధులు కేటాయించాలి

● జీరో అవర్‌లో ప్రస్తావించిన ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జీరో అవర్‌లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి నియోజకవరంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల చెరువులున్నాయని, వాటిని మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఆధునీకరించి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే కల్వర్టులు, ఓపెన్ హెడ్ చానల్స్ నిర్మించడానికి నిధులు కేటాయిస్తే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతమైన సీతంపేట మండలానికి ఉపాధి హామీ పథకంలో భాగంగా జీడి, మామిడి పంటలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గిరిజనులు పంటలు పండించుకునే ప్రాంతాల్లో వరదల నుంచి రక్షణగా గోడలు నిర్మించాలన్నారు. అలాగే భామిని మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని కోరారు. వంశధార కాలువ నిర్మాణం, తోటపల్లి కాలువ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, వీటితో పాటు పిల్ల కాలువలను ఆధునీకరించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు.



జీరో అవర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఇసుక ర్యాంప్ పరిశీలన



ఇసుక ర్యాంప్ పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

భామిని: మండలంలోని నేరడి బిలో గల వంశధార నదీతీరంలోని ఇసుక ర్యాంప్‌ను శ్రీకాకుళం భూగర్భ గనుల శాఖాధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ర్యాంప్ జీపీఎస్‌ను పరిశీలించడంతో పాటు ఇసుక నాణ్యత, లభ్యత, రవాణా మార్గాలపై ఆరా తీశారు. మూడేళ్ల కిందట ప్రభుత్వం ఇసుక ర్యాంప్ నిర్వహించి కొంతకాలం తర్వాత నిలిపివేసింది. పరిశీలనలో మండల అధికారులు ఎస్. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.